క్లుప్తంగా

పేద కుటుంబానికి పెద్ద కష్టం


సింహాచలం బెహరా

మెళియాపుట్టి: మండల కేంద్రంలోని పొందర వీధిలో నివాసముంటున్న ధనలక్ష్మీ బెహరా (ఉపాధి వేతనదారులు) భర్త సింహాచలం బెహరాకు రెండు కిడ్నీలు పాడయ్యాయి. పచ్చకామెర్లు సైతం ఉండటంతో వైద్య ఖర్చుల కోసం దాతల సాయాన్ని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. ధనలక్ష్మీ బెహరాకు ఆమెతోపాటు పని చేస్తున్న ఉపాధి వేతనదారులు రూ.11,000 నగదును సోమవారం ఉపాధి హామీ పనుల వద్ద అందించారు. ఆర్థికసాయం అందించిన వారిలో క్షేత్రసహాయకుడు చాణుక్య, మేట్లు సుమ, సుధీర్, మేనక, అరుణ, పలువురు వేతనదారులు ఉన్నారు.

30న చందనోత్సవం


లక్ష్మీనరసింహ స్వామి విగ్రహం

ఆమదాలవలస రూరల్: ఈ నెల 30వ తేదీన మండలంలోని దివంజీపేట గ్రామంలో గల లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో చందనోత్సవం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ అర్చకుడు సోమవారం ఒక ప్రకటలో తెలిపారు. భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజల్లో పాల్గొని, స్వామివారి తీర్థప్రసాదాలు స్వకరించాలన్నారు.

మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతికి అభినందన


రెడ్డి శాంతిని అభినందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కొత్తూరు: పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమ శిక్షణ కమిటీ సభ్యురాలిగా మాజీ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇటీవల నియమించారు. కొత్తూరు మండలంలోని గురండి సర్పంచ్ బోర సింహాద్రి నాయుడు సోమవారం పాతపట్నం వెళ్లి రెడ్డి శాంతిని అభినందించారు. రెడ్డి శాంతికి క్రమ శిక్షణ కమిటీ సభ్యురాలిగా నియమించడంతో పార్టీ మరింత బలోపేతం అవుతుందని సింహాద్రినాయుడు అన్నారు. పార్టీ నాయకులు జి.గోవిందరావు, జి.వాసుఉన్నారు.

8 నుంచి ఆలయ ప్రారంభ మహోత్సవాలు


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

కొత్తూరు: మే 8 నుంచి 10వ తేదీ వరకు మండలంలోని కర్లెమ్మ పంచాయతీ పరిధి మహసింగి సమీపంలో గల వరహా లక్ష్మీనృసింహ స్వామి ఆలయ పునః ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ వద్ద నిర్మాణ కమిటీ సభ్యులు సోమవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. పర్లాకిమిడి రాజ వంశస్తుల కాలం నుంచి ఉన్న ఆలయాన్ని పునర్ నిర్మాణం చేపట్టినట్లు కమిటీ ప్రతినిధి గోగుల వరప్రసాదరావు నాయుడు తెలిపారు. మూడు రోజులుపాటు నిర్వహించే వేడుకల్లో పరిసర ప్రాంత ప్రజలు పాల్గొనాలని కోరారు. కర్లెమ్మ సర్పంచ్ లోతుగెడ్డ భగవాన్‌నాయుడు, కమిటీ సభ్యులు పాగిరి రవి, పి.రామారావు నాయుడు, నారాయణరావు, ముగిది కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

సజ్జలను కలిసిన కోట


సజ్జల రామకృష్ణారెడ్డితో కోట గోవిందరావు

ఆమదాలవలస: గుంటూరు జిల్లాలోని తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధుల శిక్షణ తరగతులు సోమవారం జరిగాయి. ఆమదాలవలస నుంచి జిల్లా అధికార ప్రతినిధి కోట గోవిందరావు హాజరయ్యారు. అనంతరం పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ఆమదాలవలస నియోజకవర్గ పరిస్థితులపై చర్చించారు.

రంగు చూసి .. మోసపోవద్దు..!

- పండ్లను కృత్రిమంగా మగ్గపెడుతున్న వ్యాపారులు
- ఫుడ్‌సేఫ్టీ లేకుండా విక్రయాలు
- ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం
- అవగాహన అవసరమంటున్న వైద్యులు


రసాయనాలు పూసిన మామిడి పండ్లు

సరుబుజ్జిలి: ఈ ఏడాది మామిడి పంట జిల్లాలో దాదాపు దెబ్బతింది. వాతావరణ ప్రతికూల పరిస్థితుల కారణంగా పూత మాడిపోయింది. దీనిని వ్యాపారస్తులు ఆసరాగా చేసుకొని వినియోగదారుల జేబుకు చిల్లులు పెడుతున్నారు. గతంతో పోల్చుకుంటే మామిడి దిగుబడి తగ్గటంతో ధర పెరిగింది. ఇటీవల వాతావరణంలో చోటుచేసుకున్న మార్పుల కారణంగా అకాల వర్షాలు, గాలులకు నేలరాలిన మామిడి కాయలను సేకరించి వాటిపై ప్రమాదకర కాల్షియం కార్బైడ్‌ను ఉపయోగించి త్వరితగతిన పక్వానికి తీసుకొస్తున్నారు. ఆరోగ్యానికి హాని కలిగించే ఈ తరహా రసాయనాలను వినియోగించకూడదని వైద్యులు సూచిస్తున్నారు.

పక్వానికి వచ్చినవి ఇలా ఉంటాయి..

ప్రస్తుత సీజన్‌లో మామిడి కాయలు పక్వానికి వచ్చినప్పుడు ప్రకృతి సిద్ధంగా వాటి నుంచి ఉత్పత్తి అయ్యే ఇథిలియన్ కారణంగా పండి మంచి రంగును స్వయంగా చేకూర్చుకుంటాయి. తద్వారా వచ్చిన రుచి, పోషకాలు ఆరోగ్యానికి ఉపయోగపడతాయి. ఈ తరహా పద్ధతులకు స్వస్తి చెప్పి రసాయనాలను వాడడం ద్వారా పక్వానికి వచ్చే పండ్లను తినడం శ్రేయస్కరం కాదు. తప్పనిసరి పరిస్థితుల్లో ఇథిలియన్ వాయువు 100 పీపీఎంలు మాత్రమే వినియోగించాల్సి ఉంటుంది. ఈ వాయువును 24 గంటలు తగిలేటట్టుగా ఐదు రోజులు కాయలను ఉంచితే సహజత్వానికి దగ్గరగా ఎటువంటి హాని లేకుండా పక్వానికి వస్తాయి. మామిడి కాయల కోత అనంతరం వంద లీటర్ల నీటికి 13 ఎంఎల్ ఎత్రిల్ కలిపి అందులో ముంచి ఆరబెడితే సహజత్వానికి దగ్గరగా పండుతాయి. మరింత సురక్షితంగా పండించాలంటే ఇళ్లల్లో వరిగడ్డి వేసి కాయలను నిల్వ ఉంచడం ద్వారా పండించవచ్చు. రంగు చూసి మోసపోవడం, సీజన్‌కు ముందు వచ్చే పండ్లను తినడం ఆరోగ్యకరం కాదు. బహిరంగ మార్కెట్‌లో పండ్లను కొని తినేముందు ఉప్పు నీటిలో 20 నిమిషాలు ఉంచి తిరిగి మంచి నీటితో శుభ్రంగా కడిగి అనంతరం తొక్క తీసి తినడం మంచిది.

తేడాలను గుర్తించండిలా..

సహజంగా పండే మామిడి కొంత పసుపు, మరికొంత ముదురు ఆకుపచ్చ రంగులో ఉండి లోపలి భాగం పరిపక్వంగా ఉంటుంది. కృత్రిమంగా పండే పండ్లు మొత్తం ఒకే విధమైన రంగును కలిగి ఉంటాయి. పైకి పండినట్టు కనిపించినా లోపల రుచిలో తేడా ఉండి పుల్లదనం ఉంటుంది. సహజంగా పండే పండ్ల నుంచి వచ్చే వాసన ఇట్టే గుర్తించవచ్చు. కృత్రిమంగా పండించిన పండ్ల నుంచి వాసన ఏమాత్రం రాదు.

కృత్రిమంగా మగ్గపెడుతున్నారు



ఏ రకం పండ్లు కొని తిందామన్న రుచిగా ఉండడం లేదు. అరటి పండ్లు రెండు కంటే ఎక్కువ తింటే అదోరకమైన మత్తు శరీరంలో ఆవరిస్తుంది. కళ్లుబైర్లు కమ్ముతున్నాయి. ఆరోగ్యమని పండ్లు తింటే చివరకు రసాయనాలు మిక్సింగ్ వలన అనారోగ్యం పాలవుతున్నాం.

– కె.అసిరినాయుడు, వినియోగదారుడు, పాలవలస, సరుబుజ్జిలి

అనారోగ్య సమస్యలు



రసాయాలను ఉపయోగించిన పండ్లు తినడం వలన ఆరోగ్యానికి హాని. దీని వలన కడుపులో అల్సర్, కేన్సర్‌తోపాటు కాలేయం, మూత్ర పిండాల వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. వినియోగదారులు శ్రేష్టమైన, సహజసిద్ధంగా పండే మామిడి పండ్లను తినాలి. నిషేధిత పదార్థాలను వాడి మామిడిని పండించి బహిరంగ మార్కెట్‌లో విక్రయిస్తున్నట్లు గుర్తిస్తే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలి.

– బి.జ్యోతిర్మయి, వైద్యాధికారి, పురుషోత్తపురం పీహెచ్‌సీ, సరుబుజ్జిలి

నేటి నుంచి సిరిమానోత్సవం


మాకివలసలో అసిరితల్లి ఆలయం


అసిరితల్లి అమ్మవారు

నరసన్నపేట: మండలంలోని మాకివలసలో మంగళవారం నుంచి అసిరితల్లి సిరిమాను పండగ మహోత్సవాలు జరగనున్నాయి. 38 ఏళ్ల తరువాత అమ్మవారి పండగలు నిర్వహిస్తున్నారు. 1987 పండగలు నిర్వహించారు. మే 7వ తేదీతో పండగలు ముగుస్తాయి. పండగల సందర్భంగా సోమవారం సనప చాటే కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం మాకివలస సమీప కాంచీపేటకు వెళ్లి మానుకు బొట్టు పెడతారు. ఈ కార్యక్రమం ఉదయం 8 నుంచి 10 గంటల మధ్య నిర్వహిస్తారు. గ్రామంలో అమ్మవారి పండగ సందడి ప్రారంభమైంది. పంచాయతీలో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. మంచినీటి సదుపాయం మెరుగుపరిచారు. విద్యుత్ లైట్లు మరమ్మతులు చేస్తూ కొన్నిచోట్ల విస్తరించినట్లు సర్పంచ్ రావాడ మోహనరావు తెలిపారు. సరిమాను ఉత్సవాలు ప్రశాంతగా నిర్వహించాలని గ్రామస్తులతోపాటు పరిసర గ్రామాల ప్రజలు సహకరించాలని కిల్లాం డిస్ట్రిబ్యూటరీ చైర్మన్ శిమ్మ చంద్రశేఖర్, సర్పంచ్ మోహన్‌రావు, ఎంపీటీసీ యాళ్ల అప్పలనాయుడు, మాజీ సర్పంచ్ యాళ్ల వేణుగోపాలరావు కోరారు. ఆరో తేదీన సిరిమాను ఊరేగింపు ఉంటుందన్నారు.

దాహం కేకలు..


చింతాడలో ట్యాంక్ వద్ద తాగునీటి కోసం బిందులతో క్యూ కట్టిన మహిళలు

ఆమదాలవలస రూరల్: మున్సిపాలిటీకి శివారులోని చింతాడ గ్రామంలో దాహం కేకలు వినిపిస్తున్నాయి. ఈ గ్రామానికి పురపాలక సంఘం ద్వారా ప్రత్యేకంగా పైలెట్ వాటర్ స్కీమ్ ఉన్నప్పటికీ ఉప్పు నీరు కావటంతో తాగేందుకు ఉపయోగపడటం లేదు. సుమారు 2,500 జనాభా ఉండే ఈ గ్రామానికి రోజు విడిచి రోజు వాటర్ ట్యాంక్ ద్వారా నీరు అందిస్తున్నారు. అరకొర నీటితో అనేక ఇబ్బందులు పడతున్నారు. ఆమదాలవలస మున్సిపాలిటీలో ఉన్నప్పటికీ శ్రీకాకుళం రూరల్ మండల పరిధిలో ఈ గ్రామం ఉంది. పక్కనే ఉన్న అనేక గ్రామాలకు రక్షిత మంచినీటి పథకాల ద్వారా నీరందిస్తున్నప్పటీ పురపాలక సంఘంలో ఉండి కూడా తాగేందుకు నీరు లేదని చింతాడ గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రతిరోజూ నీరందించాలని కోరుతున్నారు.

విజయోత్సవ ర్యాలీ


విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

హిరమండలం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో మంచి మార్కులు సాధించారు. మండల కేంద్రంలో ఎంఈఓ కె.రాంబాబు, హెచ్‌ఎం టి.కేశవరావు ఆధ్వర్యంలో సోమవారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ పాఠశాలలో చదివిన 22 మంది 500 మార్కులకు పైబడి సాధించినట్లు హెచ్‌ఎం తెలిపారు. పలువురు ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వనవిష్ణుపురంలో ఉపాధి పనులపై సమీక్ష


సమీక్షలో పాల్గొన్న అధికారులు

పోలాకి: వనవిష్ణుపురంలో ఉపాధి పనుల కల్పనపై పోలీసులు, మండల పరిషత్ అధికారులు కలిసి తహసీల్దార్ సురేస్‌కుమార్ సమక్షంలో సోమవారం సమీక్ష నిర్వహించారు. గతేడాది అక్టోబర్ 8వ తేదీన గ్రామంలో జరిగిన హత్య నేపథ్యంలో ఇక్కడ ఇంకా 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. ఆ తరువాత ఇప్పటివరకు ఇక్కడ ఎలాంటి హింసాత్మక ఘటనలు జరగకపోయినప్పటికీ, ఇటీవల కొన్ని సమస్యాత్మక పరిస్థితులను గుర్తించారు. ఈ పరిస్థితుల్లో అక్కడ పనులు చేపడితే ఇరువర్గాలకు వేర్వేరుగా పనులు కల్పించాలన్న డిమాండ్ విన్పిస్తున్నందున ఉపాధి పనుల్లో నూతన మేట్‌ల నియామకం, గ్రూపుల కేటాయింపు, పనుల నిర్వహణలపై అంచనాలు వేశారు. పోలీసులు ఇరువర్గాలకు చెందిన గ్రామ పెద్దలతో విడిగా స్టేట్‌మెంట్లను నమోదుచేసి తహసీల్దార్‌కు అందజేశారు. వచ్చే నెలలో గ్రామంలో జరగనున్న గ్రామదేవత పండగ విషయంలో సైతం సూచనలు చేశారు. గ్రామంలో వేతనదారులకు పనులు కల్పించాలని వినతులు నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకుంటామని అధికారులు తెలిపారు. ఎంపీడీఓ రవికుమార్, ఈఓపీఆర్‌డీ పద్మావతి, సీఐ శ్రీనివాసరావు, ఎస్‌ఐ రంజిత్, వీఆర్వో ప్రవీణ్ పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్ వాయిదా

పాతపట్నం: మే 10వ తేదీన జరగాల్సిన జాతీయ లోక్ అదాలత్ జూలై 5వ తేదీకి వాయిదా పడింది. ఈ మేరకు రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ ఉత్తర్వులు జారీ చేసిందని పాతపట్నం జూనియర్ సివిల్ జడ్జి ఎం.రోషిణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. న్యాయవాదులు, కక్షిదారులు, పోలీసులు గమనించాలని కోరారు.

తమ్మినేనికి సత్కారం


సీతారాంను అభినందిస్తున్న గోవిందరావు, నాయకులు

ఆమదాలవలస: మాజీ స్పీకర్, పార్టీ పీఏసీ మెంబర్ తమ్మినేని సీతారాంను బూర్జ మండలం పార్టీ అధ్యక్షుడు ఖండాపు గోవిందరావు, ఆ మండల నాయకులు సోమవారం ఆయన నివాసం వద్ద సత్కరించారు. తమ్మినేని మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలపై ప్రజలు ఎదురుతిరిగే రోజులు వచ్చాయన్నారు. వైస్ ఎంపీపీ కరణం కృష్ణంనాయుడు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

రూ.కోటితో రామాలయ నిర్మాణం


నిర్మాణంలో ఉన్న కోదండ రామాలయం

మెళియాపుట్టి: మండలంలోని గొప్పలి గ్రామంలో కోటి రూపాయలతో కోదండరామాలయ నిర్మాణం చేపడతున్నారు. గ్రామస్తులు విరాళాలు సేకరించారు. అయోధ్యలో జరిగిన ప్రాణప్రతిష్ట రోజున నిర్మాణం ప్రారంభించారు. కాకినాడ నుంచి ప్రత్యేకంగా తయారు చేసిన విగ్రహాలు తీసుకువచ్చారు. మే నెలలో ఆలయ ప్రతిష్ట ఘనంగా నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. నిర్మాణ పనులు 90 శాతం పూర్తయినట్లు పేర్కొన్నారు.

దివ్యాంగ విద్యార్థికి కిట్ అందజేత


దివ్యాంగ విద్యార్థికి కిట్‌ను అందజేస్తున్న అధికారులు

పొందూరు: స్థానిక భవిత కేంద్రంలో చదువుతున్న దివ్యాంగ విద్యార్థి జి.దేవంద్రకి చదువుకునేందుకు, ఆడుకునేందుకు అవసరమైన కిట్‌ను డీఈఓ తిరుమల చైతన్య, ఎస్ఎస్ఏ ఏపీసీ శశిభూషణ్ అందించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని జరిగిన కార్యక్రమంలో నెల్లూరుకు చెందిన సీఆర్‌సీ వారు సమకూర్చిన ఈ కిట్‌ను అందజేశారు. జిల్లా సహిత విద్య కోఆర్డినేటర్ బి.గోవిందరావు, పొందూరు భవిత కేంద్రం ఐఈఆర్టీ దినేష్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపైనే ధాన్యం నిల్వలు



ఈ చిత్రం నరసన్నపేట మండలంలోని జల్లువానిపేట వద్ద రోడ్డుపై ఉన్న ధాన్యం నిల్వలు. రబీలో పండిన ధాన్యం విక్రయాలకు రైతులు నానా పాట్లు పడుతున్నారు. ప్రభుత్వం పూర్తిగా పట్టించుకోకపోవడంతో దళారులపైనే ఆశలు పెట్టుకున్నారు. దీంతో దళారులు వారికి నచ్చినప్పుడు ధాన్యం తీసుకువెళ్తున్నారు. అప్పటివరకు ధాన్యాన్ని నిల్వ చేసేందుకు రైతులు ఇబ్బంది పడుతున్నారు. రోడ్లు వెంబడే టార్పాన్లు కట్టి ధాన్యం బస్తాలు నిల్వ చేస్తున్నారు. గతంలో పండిన ధాన్యం వెంటనే కొనుగోలు చేసేవారని, ఇప్పుడు పది రోజులపైనే అవుతున్నా ఈ ప్రభుత్వం పట్టించుకోవడంలేదని, దొంగల భయం వెంటాడుతుందని జల్లువానిపేట రైతులు వాపోతున్నారు. ధాన్యం కొనుగోలు చేస్తున్న దళారులు డబ్బులు చెల్లించేందుకు రెండు నెలల వ్యవధి కోరుతున్నట్లు తెలుస్తోంది. గత్యంతరం లేక రైతులు అంగీకరించి ధాన్యం విక్రయిస్తున్నారు.

–నరసన్నపేట

సమస్యలు పరిష్కరించండి


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అమ్మన్నాయుడు, తదితరులు

ఎల్.ఎన్.పేట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అనేక పథకాల్లో పనిచేస్తున్న కార్మికుల (స్కీమ్ వర్కర్స్) సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సి.హెచ్.అమ్మన్నాయుడు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సీఐటీయూ మండల స్థాయి సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. మే డే సందర్భంగా సీఐటీయూ జెండాను ఆవిష్కరించాలన్నారు. స్కీమ్ వర్కర్స్‌కు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా జీతాలు పెరగటం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. మే 20న అఖిలభారత సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. స్కీమ్ వర్కర్ల డిమాండ్లతో కూడిన కరపత్రాలను ఆవిష్కరించారు. అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తల యూనియన్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీముఖలింగంలో ప్రత్యేక పూజలు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగాన్ని చైత్ర మాసం సందర్భంగా సోమవారం భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. జిల్లా నలుమూలలతోపాటు విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా నుంచి భక్తులు తరలివచ్చారు. వారాహి అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. కోర్కెలు తీరడంతో గోలెంలో బియ్యం వేసి మొక్కులు చెల్లించుకున్నారు.

● ఇదేనా సంపద సృష్టి


పోలాకి మోడల్ డంపింగ్ యార్డ్‌లోని కుండీలో ఉన్న మద్యం సీసాలు

పోలాకి: మండల కేంద్రంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో తడిచెత్త, పొడిచెత్త వేరుచేసే కుండీలో చెత్తమాట అటుంచితే కూటమి ప్రభుత్వ మద్యం విధానంలో ఎక్కడ చూసినా మద్యం బాటిళ్లే కన్పిస్తున్నాయి. ఉదయాన్నే వీధుల్లోకి వెళ్లిన పారిశుద్ధ్య కార్మికులకు (గ్రీన్ అంబాసిడర్‌లు) చెత్త కంటే ఎక్కువ మద్యం సీసాలో దొరుకుతున్నాయట. ఒకప్పటి జిల్లాలోనే మోడల్ డంపింగ్ యార్డ్‌లో ఇప్పుడు ఈ పరిస్థితి దాపురించింది. చెత్త నుంచి సంపద తయారీ కన్నా.. సిండికేట్ మద్యం పాలసీ, తద్వారా నడుస్తున్న బెల్ట్ దుకాణాలతో కూటమి నాయకులకు బలే సంపద సృష్టి జరుగుతుందనటానికి ఇవే సాక్ష్యం అంటూ స్థానికులు చర్చించుకుంటున్నారు. ఈ ఖాళీ సీసాలతో పంచాయతీ అధికారులు ఎలా సంపద తయారు చేస్తారో చూడాలి మరి.

అంగన్‌వాడీ కేంద్రాల పరిశీలన


బద్రిలో గర్భిణులు, బాలింతలతో మాట్లాడుతున్న కేంద్ర బృందం సభ్యులు

సారవకోట: మండలంలో కేంద్ర బృందం సభ్యులు సోమవారం పర్యటించారు. నాగాలాండ్‌కు చెందిన జుబిమో జామి, ఓబెడ్ మాఘ్‌తోపాటు రణస్థలం సీడీపీఓ జాన్సీబాయ్, పోషణ్ అభియాన్ డీపీఏ మహేష్‌లు మండలంలోని బద్రి, బుడితి అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. పోషణ ట్రాకర్ యాప్‌లో నమోదు చేస్తున్న ప్రీ స్కూల్ పిల్లలు, టీహెచ్ఆర్ పిల్లల బరువు, ఎత్తులను తనిఖీ చేశారు. గర్భిణులు, బాలింతలతో మాట్లాడి ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అమలు జరుగుతున్న కార్యక్రమాలు గూర్చి అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు మంజూరైన పోషణ వాటిక, రైన్ వాటర్ హార్వేస్టింగ్, మరుగుదొడ్లు తదితర అంశాలను పరిశీలించారు. ఈ వివరాలను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు బృందం సభ్యులు తెలిపారు. సారవకోట సీడీపీఓ హెచ్‌కె కామాక్షి, సూపర్‌వైజర్లు సుజాత, పద్మ ఉన్నారు.

ఉత్సాహంగా వాలీబాల్ పోటీలు


వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

నరసన్నపేట: మండలంలోని యారబాడులో వాలీబాల్ పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. నీలమ్మ గ్రామ దేవత ప్రతిష్ట మహోత్సవాల సందర్భంగా జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నారు. ఆదివారం ప్రారంభమైన పోటీలు సోమవారం కూడా కొనసాగాయి. మొత్తం 24 జట్లు రిజిస్ట్రేషన్ చేసుకున్నాయి. సోమవారం వరకు 16 జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. వర్షం కారణంగా పోటీలు సాయంత్రం నిలిచిపోయాయి. తదుపరి పోటీలు రెండు రోజులు ప్రతిష్ట మహోత్సవాలు పూర్తయిన తరువాత నిర్వహిస్తామని కమిటీ ప్రతినిధులు కన్నబాబు, పూతి రమణ తెలిపారు. అసిరితల్లి గ్రామ దేవత ప్రతిష్ట మహోత్సవాలు మంగళవారం నుంచి నిర్వహించనున్నారు.

బహుమతుల ప్రదానం


విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న శ్రీధర్, ఉపాధ్యాయులు

హిరమండలం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులు ఇటీవల విడుదలైన ఫలితాల్లో ప్రతిభ చూపారు. హెల్పింగ్ హ్యాండ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ పోతురాజు శ్రీధర్ ఆధ్వర్యంలో సోమవారం పాఠశాలలో అభినందన సభ ఏర్పాటు చేశారు. 500 మార్కులకు పైగా సాధించిన 21 మంది విద్యార్థులకు బహుమతులు అందజేశారు. బ్యాగులు, నోటు పుస్తకాలు, పెన్నులు, తదితర విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. హెచ్‌ఎం టి.కేశవరావు, పీఎంసీ చైర్‌పర్సన్ కల్యాణి, పలువురు ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సారవకోట: మండలంలో సారవకోట విద్యుత్ ఉప కేంద్రం పరిధిలో నిర్వహణ పనులు నిమిత్తం మంగళవారం విద్యుత్ సరఫరాను నిలుపుదల చేయనున్నారు. ఈ మేరకు విద్యుత్ శాఖ టెక్కలి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శంకరరావు సోమవారం తెలిపారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సారవకోటతోపాటు అలుదు, కుమ్మరిగుంట, వాండ్రాయి, బెజ్జి, బురుజువాడ, అంగూరు, తదితర గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు తెలిపారు.

ఉదయ్‌కిరణ్‌కు అభినందన


ఉదయ్‌కిరణ్‌ను అభినందిస్తున్న సూర్యారావు

బూర్జ: ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్షల్లో మండలంలోని ఓ.వి.పేటకు చెందిన బుడుమూరు ఉదయ్‌కిరణ్ 593 మార్కులు సాధించడంతో వైస్ ఎంపీపీ బుడుమూరు సూర్యారావు సోమవారం అభినందించారు. ఉదయ్‌కిరణ్ ఓ.వి.పేట ఏపీ మోడల్ స్కూల్‌లో చదివాడు. తల్లిదండ్రులు, గ్రామస్తులు ఉన్నారు.